క్లుప్తంగా

ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న మోహన్‌రెడ్డి

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలం ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన మధురగళ్ల రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మామిడి మోహన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఈ సందర్భంగా ఆయన హామీనిచ్చారు. ఆయన వెంట సర్పంచ్ చిత్తారిగౌడ్, వైస్ ఎంపీపీ శేఖర్‌రెడ్డి, నాయకులు రాజేందర్, ఆంజనేయులు, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి బోనాలు



ఊరేగింపులో డోలు కళాకారుల విన్యాసాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గోనెపల్లిలో శనివారం రెడ్డి సంఘం సంఘం ఆధ్వర్యంలో మహంకాళమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో డోలు, ఒగ్గు కళాకారుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళ్లారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఎంపీపీ మాణిక్యరెడ్డి, రెడ్డి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుద్రారంలో గ్రామదేవతలకు..



బోనాలు ఊరేగిస్తున్న గ్రామస్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఆషాడమాసం సందర్భంగా అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని రుద్రారంలో శనివారం గ్రామస్తులు గ్రామదేవతలకు బోనాలు ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల శిగాల నడుమ పోతరాజుల ఆటపాటలు, జల పందిళ్లతో ఉత్సాహంగా బోనాలను ఊరేగించారు. నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

హుస్నాబాద్: మహిళా ప్రయాణికులు, సీనియర్ సిటిజన్లకు టీఎస్ ఆర్టీసీ కల్పించిన గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రయాణికులకు ఆర్థిక భారం తగ్గించేందుకు 55 నుంచి 66 కి.మీ. వరకు అందుబాటులోకి తెచ్చిన టి-9 టికెట్ సమయాల్లో ఆర్టీసీ మార్పులు చేసిందన్నారు. పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే మహిళలు, సీనియర్ సిటిజన్ల కోసం తొలిసారిగా అందుబాటులోకి తెచ్చిన టి-9 టికెట్ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వర్తిస్తుందని ప్రకటించిందన్నారు. గతంలో ఉదయం 9 గంటల నుంచి 6 గంటల వరకే ఈ టికెట్ చెల్లుబాటు అయ్యేదన్నారు. తిరుగు ప్రయాణంలో ఎక్స్‌ప్రెస్ బస్సులో కూడా రూ.20 కాంబి టికెట్ చెల్లించి కూడా ప్రయాణించే సదుపాయం కల్పించినట్లు డిపో మేనేజర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు.

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ సంస్థ టీ9 పేరుతో రూ.100 చార్జీలు చెల్లించి 60 కిలోమీటర్ల దూరం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉచితంగా ప్రయాణించవచ్చని సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్లె వెలుగు బస్సుల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మోదీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వరంగల్‌లో జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభలో పాల్గొనేందుకు శనివారం సిద్దిపేట జిల్లా నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. వాహనాన్ని జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి వరంగల్ సభకు వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, బాలేశ్‌గౌడ్, రామచంద్రారెడ్డి, నరేశ్, ఉపేందర్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేశం, అరుణారెడ్డి తదితరులు ఉన్నారు.

గుంతలు..బాబోయ్..

- కంకర తేలిన రోడ్లతో అవస్థలు
- మరమ్మతులు చేయాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు



పరివేద శివారులో కంకర తేలిన రోడ్డు

కోహెడరూరల్(హుస్నాబాద్): మారుమూల గ్రామాల రోడ్లు నరకాన్ని తలపిస్తున్నాయి. ఎక్కడ చూసినా గుంతలతో దర్శనమిస్తున్నాయి. వాటిని మరమ్మతులు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండలంలోని పరివేద గ్రామం నుంచి హుస్నాబాద్ వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డు నిండా కంకర తేలి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దీంతో రోడ్డు గుంతలుగా తయారైంది. ఈ గుంతల నుంచి వాహనదారులు ప్రయాణం చేయాలంటే నరకంగా ఉందని వాపోతున్నారు. వాహనదారులు ప్రమాదాలకు గురైన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ విషయంపై ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ రోడ్డు గుండా వందల సంఖ్యలో వాహనదారులు ప్రయాణం సాగిస్తుంటారు. అయినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా గుంతలు, కంకర తేలిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



కాంట్రాక్టర్లకు సూచనలు ఇస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రంలో అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్న ఎంపీడీఓ భవన నిర్మాణాన్ని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. చిన్న చిన్న పనులను త్వరగా పూర్తి చేసి వారంరోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆయన ఆదేశించారు. నిర్మాణంలో మార్పులపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీలింగం, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి, కో-ఆప్షన్ మెంబర్ ఎండీ.అహ్మద్, తాజా మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యనారయణ, వైస్ చైర్మన్ మల్లేశం, సర్పంచ్‌లు రంగనబోయిన రాములు, బాల్‌నర్సింహులు, కిష్టయ్య, ఎంపీటీసీలు సుతారి నర్సింహులు, లక్ష్మీమల్లయ్య, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కమలాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గొట్టం భైరయ్య, నాయకులు పాల్గొన్నారు.

మహంకాళమ్మకు పూజలు

ఆషాడ మాసం సందర్భంగా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని మహంకాలమ్మ ఆలయంలో శనివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు ఎంపీని ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.

బీమా చెక్కు అందజేత

రాయపోలు(దుబ్బాక): కార్యకర్తలకు బీఆర్‌ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండలం దొమ్మాటకు చెందిన జర్నలిస్టు కొల్పుల శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన బీఆర్‌ఎస్ పార్టీలో సభ్యత్వం తీసుకోవడంతో బీమా పరిహారం రూ.2లక్షలు మంజూరైంది. కాగా ఆ పరిహారం చెక్కును శనివారం బాధిత కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు.

తెలంగాణలో సీఎం కేసీఆర్‌కు ఎదురులేదు

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణంతో పాటుగా నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి శనివారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ సభలో పీఎం మోదీతో పాటు బీజేపీ నాయకులు కిషన్‌రెడ్డి, సంజయ్‌తో పాటు మాట్లాడిన వారంతా సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్‌ను టార్గెట్ చేస్తూ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్‌కు ఎదురులేదని వందకుపైగా సీట్లు సాధిస్తుందన్నారు. రఘునందన్‌రావును దుబ్బాక ప్రజలు చిత్తుగా ఓడిస్తారన్నారు. అనంతరం పలు బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు.

గండిపల్లిని పూర్తి చేయరూ..

కట్టపై కాంగ్రెస్ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మెట్టప్రాంత రైతుల చిరకాల కోరికైన గండిపల్లి ప్రాజెక్టును ఎప్పుడు పూర్తి చేస్తారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు గండిపల్లి ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2007లో గండిపల్లి ప్రాజెక్టును శంకుస్థాపన చేసుకుంటే 15ఏళ్లు కావొస్తున్న పూర్తి చేయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగైదు సంవత్సరాల క్రితం ప్రారంభమైన రంగనాయకసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి నీటితో నింపారన్నారు. గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టుల వద్ద కుర్చీ వేసుకొని పనులు పూర్తిచేయిస్తానన్న సీఎం కేసీఆర్ మాట ఏమైందని నిలదీశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంత రైతులు బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతారని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో రావడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు స్వామిరెడ్డి, రమేశ్, గండిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు బందారం రాజయ్య, యూత్ మండల అధ్యక్షుడు దాము, నాయకులు శ్రీనివాస్, చింతల బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అక్కన్నపేట(హుస్నాబాద్): 32 ఏళ్ల తర్వాత బాల్యమిత్రులు ఒకచోట కలుసుకోవడం చెప్పుకోలేని మధుర అనుభవం. శనివారం అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991–92 విద్యా సంవత్సరంలో 7వ తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులతో పాటు విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి, సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాంబరాజు, మాజీ జెడ్పీటీసీ బీలునాయక్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

'నిరుపేదలను విస్మరించిన బీఆర్‌ఎస్'



కాంగ్రెస్ పథకాలను వివరిస్తున్న సూర్యవర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డా.సూర్యవర్మ అన్నారు. శనివారం చిన్నకోడూరులో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ఏ ఒక్క పేదోడు సంతోషంగా లేడన్నారు. నిరుపేదలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, అజ్జు యాదవ్, ఎల్లం, దిలీప్, వెంకట్, మధు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తిరిగి ఇందిరమ్మ రాజ్యం వస్తుందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆత్మగౌరవ యాత్రలో భాగంగా శనివారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్‌లో ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



హుస్నాబాద్‌రూరల్: దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న గోపాలస్వామి

హుస్నాబాద్‌రూరల్: జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేదంటే సమ్మెను ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం అవరణలో కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆయన మద్దతు పలికారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ దుర్గయ్య, సదానందం, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: జీపీల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐవోసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) ఆవరణ ఎదుట చేపట్టిన సమ్మెకు శనివారం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ రంగారెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకటచారి, గ్రామ పంచాయతీ సీఐటీయూ యూనియన్ నాయకులు స్వామి, భాస్కర్, తిరుపతి, నాగరాజు, శ్రీనివాస్, నర్సింలు, నరేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): పంచాయతీ కార్మికులు, సిబ్బంది న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అయిలయ్య, సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి అన్నారు. శనివారం అక్కన్నపేట మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయితీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె శనివారం నాటికి మూడో రోజుకు చేరుకుంది.

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మెకు సీఐటీయూ మండల నాయకులు మద్దెల ఆంజయ్య, సురేందర్‌లు సంఘీభావం తెలిపారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

సిద్దిపేటజోన్: తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసి చెత్తబండికి మాత్రమే ఇవ్వాలని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు అన్నారు. నడుస్తూ చెత్త వేరు చేయుట కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట పట్టణంలోని 14వ వార్డులో మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, కౌన్సిలర్‌తో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ శనివారం ఉదయం ప్రజలకు చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వచ్ఛ సిద్దిపేటే మంత్రి హరీశ్‌రావు ప్రధాన లక్ష్యం అన్నారు. వార్డులో రోడ్డు పక్కన ఉన్న టిఫిన్ సెంటర్‌లో ప్లాస్టిక్ వినియోగం చూసి నిర్వాహకులపై మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మహేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలు మరువలేనివి



హుస్నాబాద్: నివాళులర్పిస్తున్న నాయకులు



వర్గల్‌లో..



చేర్యాల(సిద్దిపేట): నివాళులర్పిస్తున్న నాయకులు



కోహెడలో..



గజ్వేల్‌రూరల్: ప్రజ్ఞాపూర్‌లో..

హుస్నాబాద్: ఉమ్మడి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలు మరవలేనివని పలువురు నాయకులు కొనియాడారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం కాంగ్రెస్ పార్టీ, వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో వేర్వేరుగా వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, మండల అధ్యక్షుడు చందు, కౌన్సిలర్లు పద్మ, సరోజన, రాజు, నాయకులు హస్సెన్, శ్రీనివాస్ రాజు, వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు అశోక్, శ్రీనివాస్, జానకీరాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ చౌరస్తా వద్ద మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, రాములుగౌడ్, నాగరాజు, జహంగీర్, అంజియాదవ్, యాదగిరి, శివ, టిల్లురెడ్డి, బాబా తదితరులు పాల్గొన్నారు.

వర్గల్(గజ్వేల్): మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద మహానేత వైఎస్సార్ విగ్రహానికి మండల కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, రమేశ్, మహేందర్, నర్సారెడ్డి, గోవర్దన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నివాసంలో వైఎస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్, యాదగిరి, శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రీనివాస్, కిష్టయ్య, దామోదర్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉచిత డ్రైవింగ్ లైసెన్సుకు సర్పంచ్ దరఖాస్తు

రాయపోలు(దుబ్బాక): దుబ్బాక నియోకవర్గంలోని 18 నుంచి 35 సంవత్సరాలలోపు యువతీ, యువకులకు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పిస్తున్న విషయం తెలిసిందే. కాగా డ్రైవింగ్ లైసెన్సు కోసం దౌల్తాబాద్ మండలం దొమ్మాట సర్పంచ్ పూజితవెంకటరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. శనివారం దుబ్బాకలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి స్వయంగా దరఖాస్తు ఫారం అందజేశారు.

◆ యువతకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన 18 ఏళ్ల వయస్సు దాటిన యువతకు జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పిస్తున్నారని జనగామ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గుజ్జ సంపత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన అందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. యువతీ, యువకులు 10వ తరగతి మెమో, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక ఫొటోతో పట్టణ, మండల ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు.

◆ ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

కొండపాక(గజ్వేల్): 2023–24 సంవత్సరానికి ఓపెన్ స్కూల్ దూర విద్యా విధానంలో 10వ తరగతి, ఇంటర్మీడియేట్ విద్యనభ్యసించడానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఓపెన్ స్కూల్ నిర్వహణ కో-ఆర్డినేటర్ లక్ష్మి, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ చంద్రబాను తెలిపారు. మండల పరిధిలోని దుద్దెడలోని హైస్కూల్లో నేటి నుంచి ఆగష్టు 10వ తేదీ వరకు అడ్మిషన్లు తీసుకుంటారన్నారు. మరిన్ని వివరాలకు 9948250886 నంబరుకు ఫోన్ చేయగలరని వారు కోరారు.

◆ దళితులకు న్యాయం చేయాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): సామాజిక వివక్షతకు గురవుతున్న దళిత(మాదిగ) సామాజిక వర్గానికి న్యాయం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవిబాబు అన్నారు. మండలంలోని తిమ్మాపూర్‌లో కుల వివక్ష జరిగిన సంఘటనపై శనివారం గ్రామానికి చేరుకొని దళిత కుటుంబాలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో కొంతకాలంగా దళితులు కుల వివక్షతకు గురవుతున్నారని చెప్పారు. ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా జిల్లా కలెక్టర్, సీపీ, సంబంధిత అధికారులు గ్రామాన్ని సందర్శించి బాధ్యులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సదన్, హరిబాబు, రాజు పాల్గొన్నారు.

◆ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

నంగునూరు(సిద్దిపేట): ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో అప్తాలమిక్ నర్సింగ్ అసిస్టెంట్ (ఓఎన్‌ఏ), విజన్ టెక్నిషీయన్ (వీటీ) కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని ఆస్పత్రి కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఓఎన్‌ఏ కోర్సుకు పది, ఇంటర్ ఒకేషనల్ చేసిన మహిళలు అర్హులన్నారు. 18 నుంచి 23 వయస్సు కలిగిన అభ్యర్థులు ఈ నెల 18న సిద్దిపేటలోని కృష్ణ సింధూర కంటి ఆస్పత్రిలో నిర్వహించే రాతపరీక్షలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు శ్రీనివాస్, 9177565637 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

◆ బ్రాహ్మణ గర్జనను విజయవంతం చేద్దాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హైదరాబాద్‌లో ఆదివారం జరిగే బ్రాహ్మణ గర్జన సభను విజయవంతం చేద్దామని సిద్దిపేట జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మంగు హరిహరరావు, ప్రధాన కార్యదర్శి భాస్కరశర్మలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి రాజకీయాల్లో సరైన ప్రాతినిథ్యం లేదని అన్నారు. దేశ వ్యాప్తంగా బ్రాహ్మణులకు ఆదరణ ఇవ్వాలన్నారు. బ్రాహ్మణ సామాజిక వర్గంలో ఐక్యత సాధించి పలు హక్కుల సాధనకు హైదరాబాద్‌లో బ్రాహ్మణ గర్జన పేరుతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. బ్రాహ్మణ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ సభ జరగనుందని తెలిపారు.

◆ 11న ఇంటర్మీడియట్ స్పాట్ అడ్మిషన్లు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ గిరిజన సంక్షేమ ప్రతిభ గురుకుల కళాశాలలో మిగిలిన సీట్లకు ఈ నెల 11న స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి శనివారం తెలిపారు. ఎంపీసీలో 8, బైపీసీలో 12 సీట్లు ఉన్నాయని, కరీంనగర్, వరంగల్ ఆర్‌సీఓ డీఎస్. వెంకన్న ఆదేశాల మేరకు స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్ కాలేజీ ఆవరణలోనే నిర్వహించనున్నట్లు చెప్పారు. అసక్తి గల గిరిజన విద్యార్థులు 10వ తరగతి ఉత్తీర్ణత మార్కుల మెమో, స్టడీ, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు, ఆధార్ కార్డు, పాసుపోర్టు సైజు ఫొటోలు తీసుకొని హాజరుకావాలన్నారు.

◆ 12న ఇసుక వేలం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా కూడవెల్లి వాగు నుంచి అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ ఇసుకను ఈ నెల 12న వేలం వేస్తామని తహసీల్దార్ ఉదయశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిల్వ ఉంచినట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందు రూ.1500లు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఎక్కువ వేలం పాట పాడిన వారు ఇసుక నిల్వలను దక్కించుకోవచ్చన్నారు.

◆ ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు విరాళం

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ వార్డులో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నూతన ఐలమ్మ విగ్రహానికి చెల్లాపూర్ 3వ వార్డు కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి శనివారం రూ.10వేల విరాళం అందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

◆ వైద్యఖర్చులకు సాయం

దుబ్బాకరూరల్: మండలంలోని రఘోత్తంపల్లి గ్రామానికి చెందిన కాస్తి సురేష్ ఆరు నెలలుగా కిడ్నీలు ఫెయిలై అనారోగ్యానికి గురయ్యాడు. సురేశ్ తల్లి కిడ్నీ ఇవ్వడానికి సిద్ధమైంది. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆర్థిక స్తోమత లేక పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు ఇబ్బందిగా మారింది. విషయం తెలుసుకున్న తోటి బాల్యమిత్రులు రూ.77,700లను శనివారం హైదరాబాద్‌లో సురేశ్ కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, రమేశ్, మనోజ్, రమేశ్, రాజు, యాదగిరి, స్వామి, అశోక్, కుమార్, నరేశ్, రాకేశ్, సంతోష్, చందు పాల్గొన్నారు.

◆ గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నిక

సిద్దిపేటఅర్బన్: అర్బన్ మండలం మిట్టపల్లి గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. సిద్దిపేట జిల్లా పీపీఎల్ అధ్యక్షుడు బండి తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా గాజుల బాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌రాజ్, జిల్లా కోశాధికారి మహేశ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

గురుకులంలో మాక్ పోల్



మాక్ పోల్‌లో పాల్గొన్న విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాల-చెప్యాల క్రాస్ రోడ్డులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోల్ నిర్వహించారు. ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఓటర్లుగా, ఎన్నికల నిర్వహణ అధికారులుగా వ్యవహరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ప్రిన్సిపాల్ ధనలక్ష్మి వివరించారు.